ప్రజాశక్తి
శనివారం 7 జనవరి 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

తక్షణమే రద్దు చేయాలి

- ప్రజాస్వామ్యాన్ని హరించేందుకే జీవో నెం.1
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు



జీవో నెం.1 ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ప్రజాస్వామ్యాన్ని హరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 1861 యాక్ట్‌లోని జీవో నెం.1ను తీసుకొచ్చిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు విమర్శించారు. రోడ్లపై బహిరంగ సభలు, సమావేశాలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.1ను వ్యతిరేకిస్తూ శుక్రవారం మండల కేంద్రం మార్టూరులో సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు ఆధ్వర్యం లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలపై ఇప్పటికే అనేక రకాల నిర్బం ధాలను కొనసాగిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు దానికి కొనసాగింపుగా జీవో నెం.1 ప్రవేశ పెట్టిందని ధ్వజమెత్తారు. పోలీసులు, ఇంటె లిజెన్స్ విభాగం వైఫల్యంతోనే కందుకూరు, గుంటూరు పట్టణాల్లో అపశృతులు చోటుచేసుకున్నాయన్నారు. దీనిని సాకుగా చూపి ప్రజాస్వామ్య హక్కులను హరించేందుకు ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు ఎదుర్కోవడానికి వివిధ వర్గాల ప్రజలు ముందుకు వచ్చి పోరాటం చేయాలన్నారు. జీవో నెంబర్.1ని రద్దు చేయకుంటే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమానికి సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాయని వినోద్ బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు, రైతు సంఘం నాయకులు ఎనికపాటి రాంబాబు, బోడెంపూడి సూరిబాబు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణం కోసం

రూ.5 వడ్డీకి అప్పు తెచ్చాం..

- ఇల్లు పూర్తవటానికి రూ.10 లక్షలపైనే ఖర్చవుతోంది..
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎదుట లబ్ధిదారుల ఆవేదన
- జగనన్న కాలనీలను సందర్శించిన సిపిఎం బృందం



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను సందర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-టంగుటూరు

'ప్రభుత్వం ఇల్లు కట్టించి ఇస్తామంటే దరఖాస్తు చేసుకున్నాం.. స్థలం మంజూరైంది. ఇల్లు కట్టుకోకపోతే స్థలం కూడా వెనక్కి తీసుకుంటామని అధికారులు బెదిరించారు. దీంతో గత్యంతరం లేక ఐదు రూపాయల వడ్డీకి రూ.లక్ష అప్పు తెచ్చి ఇంటి పని మొదలుపెట్టాం..' అని టంగుటూరు మండలం, జమ్ములపాలెంలో జగనన్న కాలనీలోని లబ్ధిదారు కోయా వెంకటలక్ష్మి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎదుట వాపోయారు.

రూ1.80 లక్షలకు గానూ రూ.1.72 లక్షలు మంజూరయ్యాయని, మరో రూ.8 వేలు రాలేదన్నారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యేసరికి రూ.10 లక్షల పైగానే ఖర్చయిందని మరో లబ్ధిదారు రాయపాటి రజిని సిపిఎం నాయకుల దష్టికి తెచ్చారు.

టంగుటూరు మండలంలోని జమ్ముల పాలెం జగనన్న లేఅవుట్‌ను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు జిల్లా నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. లేఅవుట్‌లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు, అసలు ప్రారంభం కాని ప్లాట్లను ఆయన పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జమ్ములపాలెం జగనన్న లేఅవుట్ లో 157 ప్లాట్లు కేటాయించగా ఐదు ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయని, అధిక శాతం లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాకపోవడంతో పిచ్చి చెట్లు పెరిగి అడవులను తలపిస్తున్నాయని పలువురు లబ్ధిదారులు వాపోయారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ పేరు గొప్ప.. ఊరు దిబ్బ మాదిరిగా జగనన్న కాలనీలు మారాయన్నారు. నిరుపేదల సొంతింటి కలను ప్రభుత్వం నిజంగా నెరవేర్చదలుచుకుంటే హౌసింగ్ బోర్డు ద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పూర్తయిన గహాలు 7553 మాత్రమేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీలన్నీ జనావాసాలు లేని అడవి ప్రాంతాలలో కేటాయించారని, కొన్నిచోట్ల వాటిలో మౌలిక సదుపాయాలు కూడా ప్రభుత్వం కల్పించకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ఆసక్తి చూపడం లేదన్నారు. ప్రకాశం జిల్లాలో 95,891 ఇళ్లు మంజూరు కాగా ▶ 2లో

ఫ్యాక్షన్‌కు కొత్త భాష్యం చెప్పే

వీరసింహారెడ్డి

- చరిత్రలో నిలిచిపోయే సినిమా
- సినీ హీరో నందమూరి బాలకృష్ణ
- అట్టహాసంగా 'వీర సింహారెడ్డి' ప్రీ రిలీజ్ ఫంక్షన్


8లో ▲



మాట్లాడుతున్న సినీ హీరో బాలకృష్ణ, పక్కన గోపీచంద్, శృతిహాసన్



అభిమానులతో కిక్కిరిసిన వీరసింహారెడ్డి సినిమా ప్రీరిలీజ్ వేడుక ప్రాంగణం



భోజనం అందజేస్తున్న టిడిపి నాయకులు

కనిగిరిలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు

8లో ▲



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న మేరుగు నాగార్జున

కబడ్డీ పోటీలు ప్రారంభం

8లో ▲

ప్రభుత్వ ఆసుపత్రిలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్‌పి భవాని హర్ష ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మందులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అనంతరం రోగులతో సమావేశమై ఆసుపత్రిలోని సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ తనిఖీలులో విజిలెన్స్ సిఐ డివివి.సుబ్బారావు, ఎస్ఐ నాగేశ్వరరావు ,ఎలక్ట్రికల్ ఎఇ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

సచివాయాల్లో ఆధార్ సేవలు : ఎమ్మెల్యే

గిద్దలూరు : అన్ని సచివాలయాల్లో దశలవారీగాఆధార్ సేవలు అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. గిద్దలూరు పట్టణంలోని రాచర్ల రోడ్ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఆధార్ నమోదు, మార్పులు, చేర్పుల కోసం మీ సేవ కేంద్రాలు, బ్యాంకుల వద్దకు వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడాల్సి ఉండేదన్నారు. ప్రజల కష్టాలను గమనించి సచివాలయాల్లోనే ఆధార్ కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, వార్డు కౌన్సిలర్లు సాయి పోగు రిబ్కా, మానం బాలిరెడ్డి, వైసిపి నాయకులు గోన రంజిత్, కాతా నరసింహ రెడ్డి, బాలచెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ రామకష్ణయ్య,పాల్గొన్నారు.



ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట రాంబాబు

యూనియన్ గుర్తింపు పత్రం అందజేత

త్రిపురాంతకం : మండల పరిధిలోని ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్ అండ్ డ్రైవర్ కార్మికులు (సిఐటియు) యూనియన్ ఏర్పాటు కోసం ఒంగోలులోని డిసిఎల్ఐ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు పరిశీలన అనంతరం మార్కాపురం లేబర్ అసిస్టెంట్ కమిషన్ పవన్‌కుమార్ ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్ అండ్ డ్రైవర్ కార్మికులు (సిఐటియు) యూనియన్‌కు గుర్తింపు పత్రం శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు రఘురాం, త్రిపురాంతకం మినీ ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్ అండ్ అసోసియేషన్ మండల అధ్యక్షులు కార్యదర్శి కాశి, ట్రెజరర్ మహంకాళి, వెంకటేశ్వర్లు, సిఐటియు మండల నాయకులు జి. రాజారామయ్య; సిపిఎం జిల్లా నాయకుడు బి. రఘురాం తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ గుర్తింపు పత్రం అందుకుంటున్న కార్మికులు

జగనన్న కాలనీ లేఅవుట్ల పరిశీలన

కొత్తపట్నం : మండల పరిధిలోని అల్లూరు అరుంధతి, ఆర్ఆర్ కాలనీలోని జగనన్న కాలనీ లేఅవుట్లను వికలాంగుల శాఖ సహాయ సంచాలకులు మండల స్పెషల్ ఆఫీసర్ అర్చన తెలిపారు. శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆర్ఆర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నంబూరి సూర్యనారాయణ హౌసింగ్ ఎఇ నాంచార్లు , వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆశాజ్యోతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 వడ్డీకి అప్పు తెచ్చాం..

(మొదటిపేజీ తరువాయి)

గడిచిన మూడేళ్లలో కేవలం 7,553 గహాలు మాత్రమే పూర్తయ్యాయన్నారు. బేస్‌మెంట్ లెవెల్‌లో 53,442 గహాలు ఉన్నాయని, సాంకేతిక కారణాలతో 16,819 గహాలు ప్రారంభం కాలేదని చెప్పారు. నిర్మాణ వ్యయభారంతో మరో 17,573 మంది లబ్ధిదారులు గహ నిర్మాణాలకు ముందుకు రావడం లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది పట్టాలు లేకుండా నివసిస్తున్నారని, వారందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీ గహ నిర్మాణాలపై ఈ నెల రెండో వారంలో సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టి ఈ నెలాఖరుకు రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి శ్రీకారం చూడతామని ప్రభుత్వానికి హెచ్చరికలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, సిపిఎం నాయకులు టంగుటూరి రాము, వేశపోగు మోజెస్, కేజీ మస్తాన్, టంగుటూరి వెంకట్రావు, సుబ్బారావు, మల్లాల యానాది, కొల్లాబత్తిన శ్రీనివాసరావు, పడిదపు రవికుమార్, పి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె మండలం బొబ్బర్లంక పంచాయతీ పరిధిలోని చెన్నుపల్లి వారిపాలెం గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం వైసిపి రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు ప్రారంభించారు. అనంతరం వెంకయ్య బాబు మాట్లాడుతూ రైతుల కోసం వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పశుపోషకులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాడి రైతులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ జాతీయ ఉచిత పశు కృత్రిమ గర్భధారణ పథకం ద్వారా ఎదకు రాని పాడి పశువులకు ఉచితంగా కృత్రిమ గర్భధారణ చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. సంవత్సరానికి ఒక దూడ పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం లేగదూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. 79 పశువులకు గర్భకోశ సంబంధిత వ్యాధులకు పరీక్షించారు. 30 దూడలకు జలగ మందు పంపిణీ చేశారు. ఎదకు రాని పశువులను పరీక్షించి ఖనిజ లవణ మిశ్రమం, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మీనాక్షిదేవి, వైసిపి నాయకులు పిరట్లంక తోట రాంబాబు, గ్రామ సర్పంచి ముత్తిరెడ్డి జయరామయ్య, మాజీ సర్పంచి పుల్లారావు, వార్డు మెంబర్లు నరసింహారావు, నాగేశ్వరావు, పశువైద్యశాల సిబ్బంది దేవర్ధన్, బాపూజీ, రత్నం, బాబూరావు, వివిధ గ్రామాల పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.



వంట సామగ్రి అందజేస్తున్న చెంచిరెడ్డి

వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి-కనిగిరి

స్థానిక అమరావతి గ్రౌండ్‌లో నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ డాక్టర్‌ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌లో భోజనం తయారీ కోసం వంట సామగ్రిని కనిగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు ముచ్చుమారి చెంచిరెడ్డి శుక్రవారం అందజేశారు. వంట సామగ్రి అందజేసి దాతృత్వం చాటుకున్న చెంచిరెడ్డిని డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్య్ర కమంలో టిడిపి మండల అధ్యక్షుడు నంబుల వెంకేటేశ్వర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.50 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని గార్లపేట బస్టాండ్ సెంటర్‌లో చిరు వ్యాపారం చేసుకుంటున్న చిన్ని నారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. అందులో భాగంగా ఆర్యవైశ్య సంఘం వాసవీ సత్ర సముదాయాల ఛైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు చేతులమీదుగా రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవకి శ్రీనివాసులు, నాయకులు కొలిపర్తి వెంకటస్వామి, బచ్చు రమేష్,నార్లపాటి మల్లికార్జునరావు, ఒలేటి సుబ్బారావు, టి. గోవిందరావు, తాళ్లూరి రమణయ్య, వేమా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీ

ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన డీలర్లు

ప్రజాశక్తి -శింగరాయకొండ

తాము రేషన్ దుణాలను తనిఖీ చేసేందుకు వస్తున్నట్లు ముందస్తుగానే అధికారులు సమాచారం అందిస్తున్నారు. దీంతో రేషన్ డీలర్లు అ్రపమత్తమవుతున్నారు. శింగరాయకొండలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేసేందుకు ఒంగోలు ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి శుక్రవారం వచ్చారు. తొలుత ఆమె పాత శింగరాయకొండ గ్రామంలోని రేషన్ షాపు వద్దకు వెళ్లారు. ఆ షాపు మూత వేసి ఉంది. ముందస్తుగానే సమాచారం అందడంతో ఈ షాపు మూత వేసినట్లు చర్చ సాగింది. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న. రేషన్ షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులో రికార్డును పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి రేషన్ బియ్యం ఇవ్వాల్సి ఉండగా దుకాణం వద్దే బియ్యం ఇవ్వడం గుర్తించి అలా ఎందుకు ఇస్తున్నారని డీలర్‌ను ప్రశ్నించారు. అనంతరం బైరాగిమాన్యంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రేషన్ షాపులు తనిఖీ చేసినట్లు తెలుస్తుంది. అయితే ముందస్తు సమాచారం అందడంతో రేషన్ దుకాణాల డీలర్లు అ్రపమత్తం అయ్యారు.



రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న పీడీ

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న షేక్ అహ్మద్ బాషా రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆయన కుటుంబానికి ఆసరా కోసం హెడ్ కానిస్టేబుల్ సతీమణి షేక్ షరీఫ్ ఉన్నిసాకు గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో రూ.20 లక్షల 65 వేల చెక్కును జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. ఈ సందర్భంగా మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యుల యోగక్షేమాలు ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. పోలీస్ సిబ్బంది కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని, ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను


షేక్ షరీఫ్ ఉన్నిసాకు నగదు చెక్కును అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్


స్వయంగా కలవవచ్చునని ఎస్పీ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా మాట్లాడుతూ సిబ్బంది అందరూ విధులు నిర్వహించేటప్పుడు, విధులు ముగించుకొని అనంతరం స్వస్థలాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. పోలీసు ఉద్యోగం నిత్యం సవాళ్లతో, ఒత్తిడితో కూడుకున్నది కాబట్టి సిబ్బంది అందరూ మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యపరంగా దఢంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల మీద ప్రయాణించేటప్పుడు సిబ్బంది ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని అన్నారు. మనం కూడా విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉంటే మన కుటుంబ సభ్యులు కూడా నిశ్చింతగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఏఓ వై శివప్రసాద్‌రావు, బి సెక్షన్ సూపరింటెండెంట్ కె రాధిక పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు కీలక పదవులు

- కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు దేవరపల్లి రంగా

ప్రజాశక్తి-చీరాల

కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పేద, బడుగు, బలహీన వర్గాల, ముస్లిం మైనారిటీలకు న్యాయం జరిగిందని దేశ, రాష్ట్ర అభివృద్ధి సమగ్రత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు గంటా అంజిబాబు, నియోజక వర్గ నాయకులు దేవరపల్లి రంగా అన్నారు. గురువారం చీరాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవరపల్లి రంగారావు నాయకత్వంలో పట్టణ పరిధిలోని పేరాల గాస్పల్ ప్రేయర్ హాల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలువురిని కాంగ్రెస్ పార్టీలో వివిధ కీలక పదవుల్లో నియమిస్తూ నియామక పత్రాలు అందచేశారు. గంటా అంజిబాబు మాట్లాడుతూ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు రుద్ర రాజు ఆదేశాల మేరకు కేంద్ర మాజీ మంత్రి జేడి శీలం నాయకత్వంలో జిల్లాలో పార్టీని పటిష్టపరిచేందుకు బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయకులను కీలకమైన పదవుల్లో నియమించినట్లు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. త్వరలో ప్రియాంక గాంధీని కూడా


ఐక్యతను చాటుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బాపట్ల పార్లమెంట్ పరిధిలో పర్యటించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఈ నెల 17వ తేదీన జెడి శీలం సాంథ్యంలో బాపట్ల పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాలు అటు దేశాన్ని, ఇటు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నాయని అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవరపల్లి రంగారావు మాట్లాడుతూ చీరాల నియోజకవర్గ పరిధిలో రాజకీయాలు దిగజారి పోయాయని, కొందరు దుండగులు తమ పార్టీ ఫ్లెక్సీలు తొలగించటడం అత్యంత దారుణం అని, దిగజారుడు తనానికి నాంది అని అన్నారు. అనంతరం పలువురికి పదవీ బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రాలు అందజేశారు. పట్టణ అధ్యక్షుడిగా బండ్లమూడి విజయ్ కుమార్, మండల అధ్యక్షునిగా మర్రి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా దాసి పీటర్ రమేష్, పార్టీ ప్రచార కార్యదర్శిగా బత్తుల బ్రహ్మానందం, వేటపాలెం మండల అధ్యక్షునిగా బండ్ల శ్రీనివాసరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా కర్రా హేని గ్రేస్, పట్టణ మహిళా అధ్యక్షురాలుగా జంగాల సునీత, రూరల్ మహిళ అధ్యక్షురాలుగా తవటిక రమ్య, పార్టీ మహిళ సెక్రటరీగా మాదాల వైష్ణవిలను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాఘం మురళి, యువజన నాయకులు దేవరపల్లి అరవింద్, ముస్లిం మైనారిటీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

- జిల్లాలో మొత్తం ఓటర్లు 12,47,611
- పురుషులు 6,09,278.. మహిళలు 6,38,254

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నూతన ఓటర్ల జాబితాను రాష్ట ఎన్నికల సంఘం విడుదల చేసింది. జనవరి 5 నాటికి అర్హులైన ఓటర్ల జాబితాను విడుదల చేశారు. బాపట్ల జిల్లాలో పురుష ఓటర్లతో చూస్తే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 12,47,611 కాగా ఇందులో పురుష ఓటర్లు 6,09,278, మహిళా ఓటర్లు 6,38,254, ఇతరులు 79 మంది ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

అసెంబ్లీ నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు
వేమూరు (ఎస్‌సి)	92,508	98,102	7
రేపల్లె	1,10,056	1,14,164	26
బాపట్ల	88,239	92,991	8
పర్చూరు	1,09,555	1,15,576	8
అద్దంకి	1,14,935	1,18,934	12
చీరాల	93,985	98,487	18
మొత్తం	6,09,278	6,38,254	79

ఆర్‌బికెల్లో వ్యవసాయ సలహా మండలి సమావేశాలు

ప్రజాశక్తి-నగరం

నగరం మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాలు శుక్రవారం నిర్వహించారు. అందులో భాగంగా నగరం రైతు భరోసా కేంద్రంలో జరిగిన గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ముఖ్యఅతిథిగా రేపల్లె సహాయ వ్యవసాయ సహాయ వ్యవసాయ సంచాలకులు అక్తర్ హుస్సేన్ మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధర సాధారణ రకం 100 కేజీల ధర రూ.2,040, గ్రేడ్ ఎ రకం రూ.2,060 రూపాయలుగా మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందరూ ఆర్‌బికెల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని సూచించారు. అలాగే రైతులు అందరూ ప్రభుత్వం అనుమతి ఉన్న డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, ఆ సమయంలో బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని, విత్తన శుద్ధి తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మండల వ్యవసాయ


మాట్లాడుతున్న ఎడిఎ అక్తర్ హుసేన్

అధికారి వి రమేష్ బాబు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇ-క్రాఫ్‌లో నమోదు చేసుకున్న రైతులు, తమ ధాన్యం అమ్మేందుకు సిద్ధమైతే వారి పంట వివరాలు ఆర్‌బికెకు తెలియజేయాలని సూచించారు. ఆర్‌బికెలోని టెక్నికల్ సిబ్బంది రైతు పొలం /కళ్ళం వద్దకే వచ్చి ధాన్యం నాణ్యతను, తేమ శాతాన్ని పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ కె నాగ శ్రీనివాసరావు, భూదేవి, సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

సిఐటియు క్యాలెండర్ ఆవిష్కరణ


సిఐటియు ఒంగోలు నగర కమిటీ కొత్త సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలోఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్, డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, నగర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రాంబాబు, టి మహేష్, సిఐటియు నగర నాయకులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, శ్రీరామ్ శ్రీనివాసరావు, ఎస్‌డి హుస్సేన్ పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, ఒంగోలు కలెక్టరేట్

7న ప్రధానోపాధ్యాయుల సమావేశం

ప్రజాశక్తి-చెరుకుపల్లి

బాపట్ల డివిజన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 7వ తేదీన సమావేశం నిర్వహిస్తున్నట్లు గుళ్లపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, భట్టిప్రోలు మండల విద్యాశాఖ అధికారి పులి లాజర్ తెలిపారు. గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ సమావేశానికి జిల్లా విద్యాశాఖ అధికారి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు. ఏడో తేదీన సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు సమావేశం జరుగుతుందని ఎంఈఓ తెలిపారు. సమావేశానికి బాపట్ల డివిజన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

కారుమంచిలో మోటార్లు చోరీ

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని కారుమంచి గ్రామంలో విద్యుత్ మోటార్లు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. శుక్రవారం మండలంలోని కారుమంచి


కారుమంచిలో మోటార్లు చోరీకి గురైన ప్రదేశం

గ్రామపంచాయతీ సర్పంచ్ మన్నం శ్రీనివాస్ సూచనలతో కార్యదర్శి అచ్చుకోల రామకృష్ణ ఈ మేరకు టంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలోని చెరువు నుంచి ఓహెచ్‌ఆర్ ట్యాంకుకు నీరు ఎక్కించేందుకు ఈ విద్యుత్ మోటార్లను ఉపయోగిస్తున్నారు. గ్రామం నడిబొడ్డున హైస్కూల్ సమీపంలోనే ఒక మోటారు ఉండగా మరొక మోటారు పంచాయతీ పరిధిలోని తుఫాన్ పాలెంలో బిగించి ఉంది. దుండగులు మోటారుకు బిగించి ఉన్న పైపులను తొలగించి గురువారం అర్ధరాత్రి సమయంలో మోటార్లను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. చోరీకి గురైన 2 మోటార్ల విలువ 80 వేలు ఉంటుందని పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో పలుమార్లు వ్యవసాయ మోటార్లు మండలంలో చోరీకి గురవుతున్నప్పటికీ ఏకంగా గ్రామం నడిబొడ్డునే ఉన్న తాగునీటి మోటార్లు చోరీకి గురవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుండ్లకమ్మలో వృద్ధురాలి మృతదేహం

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని వెల్లంపల్లి గుండ్లకమ్మలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గమనించారు. ఎస్ఐ శ్రీరామ్‌కు సమాచారం అందచేశారు. ఎస్ఐ హుటాహుటిన ఘటన స్థలానికి తన



వృద్ధురాలి మృతదేహం

సిబ్బందితో చేరుకొన్నారు. గజ ఈతగాళ్లచే మృత దేహాన్ని బయటకు తీసి పరీక్షలు చేశారు. మృతురాలికి 60-65 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని, చేతిపైన, రెండు కాళ్లపైన పచ్చ బొట్లు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హైస్కూల్ ఉపాధ్యాయురాలు మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఉపాధ్యాయురాలు ఎన్‌వి నాగలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. మండల ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు,


ఎన్‌వి నాగలక్ష్మి (ఫైల్)

సిబ్బంది ఆమె మృత దేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, భట్టిప్రోలు ఎంఈఓ పులి లాజర్, పలువురు ఉపాధ్యాయులు ఆమె మృతి పట్ల సంతాపం వెలిబుచ్చారు.


బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్ రవికిరణ్మయి

మృతురాలి కుటుంబానికి సహాయం అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు: మండల కేంద్రం భట్టిప్రోలు సచివాలయం-1కు చెందిన మండ్రు రాజేశ్వరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో జగనన్న బీమా సౌకర్యం ఉండటంతో శుక్రవారం మట్టి ఖర్చుల నిమిత్తం గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి రూ.10 వేలు నగదును అందజేశారు. ప్రభుత్వం నుంచి అందవలసిన బీమా మొత్తం త్వరలో అందజేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి శ్రీనివాసరావు, నాయకులు చెన్నయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నిధుల విడుదలకు నిబంధనలు అడ్డు

ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు గడప గడపకూ తిరిగితేనే సచివాలయాలకు నిధులు ● కోట్ల రూపాయల పనులు పూర్తయినా విడుదల కాని బిల్లులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో సచివాలయాల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు ఎలాంటి జాప్యం లేకుండా విడుదల అవుతాయని ప్రభుత్వాధినేతలు చెప్పారు. ఈ మాట నమ్మిన అధికార పార్టీ నేతలు తమ అనుయాయుల ద్వారా పట్టణాలు, గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభింప జేశారు. సచివాలయాల పరిధిలో రూ.5 లక్షల లోపు పనులు అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలే చేపట్టారు. పనులు పూర్తయ్యాయి కాని బిల్లులు ఎప్పుడు విడుదల అవుతాయో అర్థం కాని స్థితి నెలకొంది. అధికార పార్టీ శాసనసభ్యులు, ఇన్‌ఛార్జుల పనితీరు పరిశీలన కోసం సిఎం జగన్ ప్రవేశపెట్టిన గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా సచివాలయాలలో అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు సచివాలయాల వారీగా పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపారు. కానీ ఈ నిధులు పొందేందుకు నిర్దేశించిన మార్గదర్శకాలు ఇబ్బందికరంగా మారాయి. నిధులు పొందాలంటే సచివాలయ పరిధిలో రెండు రోజులు అయినా తిరగాలి. 95 శాతం గృహాలను సందర్శించాలి. ఇలా ఫొటోలు అన్ని ఇందుకోసం నిర్దేశించిన యాప్‌లో అప్‌లోడ్ కావాలి. అప్పుడు మాత్రమే ఆ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుమతి వస్తుంది. ఇలా ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్ల లాగిన్ ద్వారా పనులు మొదలు పెట్టేందుకు వీలవుతుంది. ఈ కారణంగా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు గడప గడపకూ తిరిగితేనే నిధులు విడుదల అవుతాయి. లేదంటే ఈ సచివాలయాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు వచ్చే అవకాశం లేదు. ఈ కారణంగా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు



గడప గడపకూ కార్యక్రమంలో కరణం వెంకటేష్ (ఫైల్)

తమకు ఎన్ని ఇతర పనులు ఉన్నా తాము ఎక్కడ ఉన్నా సాయంత్రం అయినా వచ్చి ఏదో ఒక సచివాలయం పరిధిలో గడప గడపకూ తిరుగుతున్నారు. ఇందుకోసం ఒక పిఎ, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తిరుగుతూ సదరు ఫొటోలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నారు. మే నెలలో ఈ కార్యక్రమాన్ని సచివాలయాల కేంద్రంగా ప్రారంభించారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల గృహాల సందర్శన తరువాత పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. రూ.5 లక్షల లోపు పనులను నామినేషన్ పద్ధతిలో చేపట్టారు. రూ.5 లక్షలు దాటిన పనులకు టెండర్లు పిలిచారు. సచివాలయాల్లో రూ.5 లక్షల పైబడిన విలువగల పనులున్నా ఎక్కువ శాతం వాటిని విడగొట్టి పార్టీ నేతలు, కార్యకర్తల ద్వారా పనులు చేపట్టారు. కానీ గతంలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ భవన నిర్మాణాలు చేపట్టి బిల్లులు రాక ఇబ్బందులు పడ్డ అధికార పార్టీ నేతలు ఎవరు పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపలేదు. గడప గడప బిల్లులు సిఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా నేరుగా వస్తాయని మొదట్లో చెప్పారు. పాత బిల్లుల సంగతి ఎలా ఉన్నా గడప గడపకూ కార్యక్రమం పనుల బిల్లులు మాత్రం వెంటనే విడుదల అవుతాయని, ఆందోళన పడవద్దని నేతలు చెప్పడంతో గ్రామాల్లో సర్పంచ్‌లు, వారి అనుయాయులు, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జ్‌లుగా ఉన్నవారు పనులు చేపట్టారు. కాని ఈ కార్యక్రమం మొదలు అయి 8 నెలలు కాగా, పనులు 5 నెలలుగా చేస్తూ వచ్చారు. కొన్ని పనులు పూర్తయ్యాయి. కాని బిల్లులు ఎప్పుడు వస్తాయో అర్థం కాని స్థితి నెలకొంది. గడప గడపకూ కార్యక్రమం బిల్లులు కూడా సిఎఫ్ఎంఎస్ ద్వారానే మంజూరవుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా ముందు పూర్తి అయిన పనుల తాలూకు బిల్లులు విడుదల కానందున సచివాలయాల్లో చేపట్టిన పలు పనులు అరకొరగానే జరుగుతున్నాయి. జిల్లాలో ఆరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 25 మండలాలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పురపాలక శాఖల ద్వారా రూ.34.78 కోట్ల విలువైన 788 పనులు ప్రతిపాదించారు. 770 పనులు మంజూరు చేశారు. ఇందులో రూ.28 కోట్ల విలువైన 682 పనులు ప్రారంభించారు. జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు 61 పనులు పూర్తి అయినట్లు లెక్కలు తేల్చారు. కానీ పూర్తి అయిన పనులకు సంబంధించి బిల్లులు నేటికీ విడుదల కాలేదు. పనులు ప్రారంభమైనప్పుడు నేరుగా బిల్లులు మంజూరు అవుతాయని చెప్పారు కాని ఇప్పుడు సిఎఫ్ఎంఎస్ ద్వారానే బిల్లులు అంటున్నారు. జిల్లాలో పలు సచివాలయాల పరిధిలో పనులు పూర్తయినా వాటిని అప్‌లోడ్ చేయడంలో పలు రకాల సమస్యలు ఉన్నట్లు చెబుతున్నారు. బిల్లుల మంజూరుకు పెట్టిన నిబంధనల కారణంగా పూర్తి అయిన ఒక్క పని కూడా సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ కానట్టు తెలుస్తుంది. పలు సాంకేతిక సమస్యల కారణంగా బిల్లులు వస్తాయో రావో అర్థంకాక అధికార పార్టీ నేతలు తలలు పట్టుకున్న పరిస్థితి ఉంది. అప్పులు తెచ్చి పనులు చేపట్టిన వారి పరిస్థితి అయోమయంగా ఉంది.



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం: మంత్రి మేరుగ

ప్రజాశక్తి-బల్లికురవ

రైతు సంక్షేమం కోసం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని, రైతు పక్షపాతిగా ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పిందని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం మండలంలోని వెలమవారిపాలెం గ్రామంలో 8.75 కోట్లతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1036 ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకాన్ని రైతులు జాగ్రత్తగా వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి కావాలని ఆయన అన్నారు. గ్రామాల అభివృద్ధిలో వ్యవసాయం కీలకమని ప్రభుత్వం అందించే వ్యవసాయ సబ్సిడీ పరికరాలను ఆర్‌బికేల ద్వారా పొందాలని ఆయన అన్నారు. రాష్ట్ర షాప్ నెట్ చైర్మన్ కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, ఎంపిడివో సిహెచ్ కృష్ణ, ఈఓఆర్‌డి సీతామాలక్ష్మి, కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపిపి బడుగు శ్రీలక్ష్మి, జడ్పిటిసి చింతల అంజలి, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



బాలుడికి పింఛను అందిస్తున్న జడ్పిటిసి రజని శ్రీనివాసరావు

నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-కారంచేడు

మండలంలో నూతనంగా మంజూరయిన 224 పెన్షన్లను కారంచేడు జడ్‌పిటిసి యార్లగడ్డ రజని శ్రీనివాసరావు శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులతో జరిగిన సమావేశంలో ఈ పంపిణీ జరిగింది. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలో ఉన్న వికలాంగులు, వితంతు, వృద్ధాప్య తదితర పెన్షన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఆర్ రమేష్ బాబు, మండల వైస్ ఎంపిపి యార్లగడ్డ సుబ్బారావు, కో-ఆప్షన్ సభ్యులు ముల్లా నూర్ అహ్మద్, మండల వైసిపి కన్వీనర్ దండా చౌదరి బాబు, కారంచేడు వైసిపి అధ్యక్షులు యార్లగడ్డ పాపారావు, సర్పంచులు మధుసూదన్ రావు, ఈఊరి మాధవి, కారుమూడి సుబ్బారెడ్డి, ఎర్రం లక్ష్మారెడ్డి, కట్ట బాబు, గోగినేని సతీష్, అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

బాక్సింగ్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో

కొల్లాటి అశోక్‌కు రజత పతకం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాక్సింగ్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ గేమ్‌లో రజత పతకం సాధించిన కొల్లాటి అశోక్‌ను బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. అశోక్ భవిష్యత్తులో మరెన్నో పతకాలు గెలిచి, దేశం గర్వించే విధంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. గత డిసెంబర్‌లో అగర్తలాలో నిర్వహించిన మైతాయ్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలుపొందిన బాపట్ల జిల్లా, నిజాంపట్నంకు చెందిన కొల్లాటి అశోక్‌ను గురువారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాపట్ల జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి తన చేతుల మీదుగా మెడల్‌ని వేసి సత్కరించారు. త్వరలో నేపాల్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్ టెస్ట్ మ్యాచ్ లలో కూడా



రజత పథకం గెలుపొందిన కొల్లాటి అశోక్‌ను అభినందిస్తున్న బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

పతకం తీసుకురావాలని, 2025లో జరిగే ఒలింపిక్ క్రీడలకు భారత్ తరపున పాల్గొనాలని కోరారు. ప్రతిభ ఉన్నప్పటికీ ప్రతిభకు తగ్గ ఆర్థిక సహకారం లేక అశోక్ క్రీడల్లో వెనుక బడుతున్న తరుణంలో ఈ విషయం తెలుసుకొని రూ.2,50,000 ఆర్థిక సహాయం చేసి మెడల్ గెలవడానికి ఎంతో ప్రోత్సహించిన గుండ్రెడ్డి శివను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ స్థాయిలో ఎంతోమంది ప్రతిభావంతులు ఉన్నప్పటికీ వివిధ కారణాల చేత వారి ప్రతిభ అక్కడే ఆగిపోతోందని, అటువంటి వారిని ప్రోత్సహిస్తే వారు దేశానికి మంచి పేరు తెస్తారని, అశోక్ లాగా ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తారని ఎస్పి తెలిపారు. అశోక్ తన కెరీర్‌లో సౌత్ ఏషియన్ ఒలింపిక్‌లో గోల్డ్ మెడల్, భూటాన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ చాపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్, థాయిలాండ్ ఓల్డ్ ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్, గోవా ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ఇంటర్నేషనల్ చాపియన్ షిప్‌లలో మొత్తం 6 బంగారు పతకాలు, ఒక రజత పతకం గెలుచుకున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

పొలంబడి క్షేత్ర దినోత్సవం

ప్రజాశక్తి-పిట్లలవాని పాలెం



పంట పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పిట్లలవానిపాలెం మండలం పోతనకట్టవారి పాలెం గ్రామంలో ఖరీఫ్ వరి పొలంబడి క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బాపట్ల జిల్లా డిడివి ఎం విజయనిర్మల, సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ లక్ష్మి పాల్గొని ఖరీఫ్ పొలం బడిలో రైతులకు ఏమేమి కార్యక్రమాలు చేశారో పేర్కొన్నారు. పొలంబడి రైతులు ఏ విధంగా అధిక దిగుబడులు సాధించారనేది వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి, వ్యవసాయ అధికారి సిహెచ్ సత్యానంద్, వ్యవసాయ విస్తరణ అధికారి సిహెచ్ సుదర్శన్‌రావు, వ్యవసాయ సహాయకులు వి జాన్‌రాజు, పొలంబడి రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాచు, గుర్రపుడెక్కతో 'మేజర్'

చివరి భూములకు సాగు నీరందక ఇక్కట్లు

ప్రజాశక్తి-సంతమాగులూరు

సంతమాగులూరు మేజర్ కాలువ నాచు, గుర్రపుడెక్కతో నిండిపోయింది. దీనివల్ల మండలంలోని బండివారిపాలెం, పత్తేపురం గ్రామాలకు సంబంధించిన, సంతమాగులూరు మేజర్ కాలువ చివరి సాగు రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల రైతులకు సంతమాగులూరు మేజర్ కాలువ నుంచే సాగునీరు గాక, సంతమాగులూరు ఇరిగేషన్ చెరువు నుంచి కూడా కాల్వ ద్వారా సంతమాగులూరు పొలిమేర తూర్పున సంతమాగులూరు మేజర్ కాలువలో ఈ కాల్వ కలుస్తుంది. అయినా ఈ కాలువలు మొత్తం నాచు, తామరాకు, గుర్రపు డెక్కలతో నిండి ఉండటంతో చివరి భూముల సాగుదారులకు సాగునీరు అందక



సంతమాగులూరు మేజర్ కాలువలో పెరిగిన నాచు, గుర్రపుడెక్క

తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక ఈ మేజర్ కాలువకు ఎగువన కొందరు రైతులు ఇంజన్ల ద్వారా తమ మెట్ట భూములకు నీరు మళ్లిస్తున్నారు. అక్రమ నీటి వాడకంపై ఎన్ఎస్పి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు బండి చెంచురామయ్య, పసుపులేటి కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేజర్ కాలువ చివరి భూముల సాగుదారులు 400 ఎకరాలలో వరి, మిర్చి, పత్తి పంటలను సాగు చేశారు. సాగునీరు ఉండి కూడా తమ పంటలను కాపాడుకోలేక పోతున్నామని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన నాచు, గుర్రపు డెక్కను తొలగించి, పూర్తిగా చివరి సాగు భూములకు సాగునీరు అందించాలని, తరువాత సీజన్‌లోనైనా మేజర్ కాలువకు సిమెంట్ లైనింగ్ చేయాలని ఆ గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

'వెలిగొండ' నిర్వాసితులను ఆదుకోవాలి

మంత్రి సురేష్‌కు వినతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

శ్రీపూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వం మీన మేషాలు లెక్కించడం సమంజసం కాదని నిర్వాసితుల సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి తెలిపారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి ముంపు గ్రామాల నిర్వాసితులను ఆదుకోవాలని ఆయన కోరారు. స్థానిక తర్లుపాడు రోడ్డు లోని రాష్ట్ర మున్సిపల్ పట్టణ అభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయంలో మంత్రి సురేష్‌ను నిర్వాసితులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసిత గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి గాలి వెంకటరామిరెడ్డి మంత్రికి వివరించారు. ప్రాజెక్టు కింద ముంపుకు గురైన 11 గ్రామాలకు చెందిన నిర్వాసితుల


మంత్రి సురేష్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సంబంధించి జాబితాను 2019లో పిడిఎఫ్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం విడదల చేసినట్లు తెలిపారు. 7,319 మందిని ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి అర్హులుగా గుర్తించి గెజిట్‌లో ప్రకటించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ తుది జాబితా అంటూ ఈ నెల 3న 11 గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో అర్హులకు సంబంధించిన జాబితాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆ జాబితాలో 2019లో ప్రకటించిన అనేక పేర్లు గల్లంతు అయినట్లు తెలిపారు. జాబితాలో పేర్లు లేని ఈనెల 11,10 తేదీల్లో ఆధారాలతో సహా అర్జీలు పెట్టుకోవాలని పేర్కొన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో గజిట్‌ను ప్రకటించి అవార్డు విచారణ చేపట్టినట్లు తెలిపారు. మళ్లీ ఇప్పుడు విచారణ అని చెప్పడం సమంజసం కాదన్నారు. 2019 నుంచి 2023 సెప్టెంబర్ కట్ ఆఫ్ తేదీని పొడగించి నాలుగు సంవత్సరాల కాలవ్యవధిలో 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులను కూడా అర్హులుగా నమోదు చేసి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముంపు గ్రామాల ప్రజలు, నిర్వాసితుల సంఘం నాయకులు పాల్గొన్నారు.


సజ్జ రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుధీర్

'సజ్జల'ను కలిసిన శిద్దా సుధీర్

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని యువ పారిశ్రామికవేత్త, వైసిపి యువనాయకుడు శిద్దా సుధీర్‌కుమార్ తాడేపల్లిలోని వైసిపి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాల గురించి చర్చించారు. అనంతరం బాపట్ల ఎంపీ నందిగం సురేష్, శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, తలశిల రాఘురామ్‌ను సుధీర్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రజానాట్యమండలి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రజల కోసం,ప్రగతి కోస మని పనిచేస్తున్న ప్రజా నాట్యమండలి సేవలు అభినందనీయమని జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీ నారాయణ పేర్కొన్నారు. స్థానిక జవహర్ నర్సింగ్‌హోంలో ప్రజానాట్యమండలి జిల్లా కేలండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెవివి డివిజన్ ఉపాధ్యక్షుడు చలువాది రమేష్, పజానాట్య మండలి జిల్లా నాయకులు ఉబ్బా కోటేశ్వరరావు,ప్రముఖ మెజీషియన్ బివి. రామన్, బి.రాజరమేష్, ఎ. సూరిబాబు ,బి.సుధాకర్,పవన్‌కుమార్ పాల్గొన్నారు.


జెవివి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న శివకృష్ణ

రాష్ట్రస్థాయి పోటీలకు కారుమంచి విద్యార్థులు

ప్రజాశక్తి : టంగుటూరు

మండల పరిధిలోని కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయుడు పెద్దిరెడ్డి కష్టారెడ్డి తెలిపారు. గతనెల 31న శింగరాయకొండలో నిర్వహించిన పోటీల్లో అండర్-14 విభాగంలో పి.అక్షయ, ఎం. అనురామ్ తేజ, అండర్-17 విభాగంలో ఆర్ మెర్సీ రాణి ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు గ్రామస్తుడు గాలి శివకష్ణ ఒక్కొక్కరికి రూ.2 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ నెల 20,21,22 తేదీల్లో కర్నూలు నిర్వ హిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొన నున్నట్లు ప్రధానో పాధ్యాయుడు కష్టారెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఆర్ ఉషారాణి, ఉపాధ్యాయులు చెన్నకేశవులు, అరుణా దేవి, సుధాకర్ బాబు, ప్రసాదరావు అభినందించారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నట్లు నిర్వాహకులు ఎ. చెంగళరాయుడు, స్టీవెన్ తెలిపారు. శుక్రవారం మొత్తం 6 టీమ్‌లు పోటీ పడినట్లు వారు తెలిపారు. శనివారం ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు వారు ఎలిపారు.



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ దుర్గాప్రసాద్

కృషి విజ్ఞాన కేంద్రానికి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు దక్కింది. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ఎన్‌వివిఎస్.దుర్గాప్రసాద్ వైస్ చాన్స్‌లర్ బత్తుల బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో 52వ పరిశోధన విస్తరణ సలహామండలి సమావేశంలో అధ్యక్షుడు డాక్టరు ఎ విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన శు క్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ అవార్డును దుర్గాప్రసాద్‌కు అందజేశారు.

చంద్రశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే

పొదిలి : వైసిపి యువ నాయకుడు కొత్తపులి చంద్రశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో ఇటీవల మరణించిన కొత్తపులి చంద్రశేఖర్ రెడ్డి సంతాపసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి మాట్లాడుతూ చంద్రశేఖర్ రెడ్డి ఆయన తండ్రి బజార్ రెడ్డి మంచితనంతో గ్రామప్రజల మన్ననలు అందుకున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కసిరెడ్డి వెంకట రమణా రెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, వైసిపి వైసిపి కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ గుజ్జుల రమణా రెడ్డి, వైసిపి మండల


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మాజీ కన్వీనర్ శ్రీను, గూడూరి వినోద్ కుమార్, నగర పంచాయతీ బిసిసెల్ అధ్యక్షుడు పులగొర్ల శ్రీనివాసులు, మాదావారి పాలెం సహకార సంఘం అధ్యక్షులు కొత్తపులి బ్రహ్మారెడ్డి, అముదాలపల్లి సర్పంచి చిరుపల్లి శ్రీనివాసులు, రాములవీడు శ్రీను, షరీఫ్, కొత్తపులి ఓబుల్ రెడ్డి, ఫిరోజ్, గుజ్జుల గిరిధర్ రెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు వడ్డీ లేని రుణం

కొండపి : పొగాకు సాగు చేసిన తుఫాను కారణంగా నష్టపోయిన పొగాకు రైతులకు రూ.10వేల వడ్డీలేని రుణాన్ని పొగాకు బోర్డు ద్వారా ఇవ్వనున్నట్లు కొండపి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వడ్డీలేని రుణం కావాల్సిన రైతులు సంబంధిత క్లస్టరు ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వడ్డీలేని రుణం కోసం ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ రుణాన్ని 2023 వేలంలో 2వ రౌండు పొగాకు అమ్మకాల నుంచి మినహాయించుకోనున్నట్లు ఆయన తెలిపారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తునన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి

ఎన్‌హెచ్ఎం జెఎసి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ జాతీయ ఆరోగ్య మిషన్(నేషనల్ హెల్త్ మిషన్) జెఎసి 2023 కేలండర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిడి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ భగీరథి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పద్మజ, ఎపి ఎన్‌హెచ్ఎం జెఎసి రాష్ట్ర కార్యవర్గ కన్వీనర్, జిల్లా జెఎసి ప్రెసిడెంట్ చల్లా ప్రభాకర్ రెడ్డి జిల్లా జెఎసిప్రధానకార్యదర్శి ఎస్. ఏడుకొండలు, జిల్లా మానసిక కార్యక్రమ సైకాలజిస్ట్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డిజైన్ మార్పు వల్లే బ్రిడ్జి పనుల్లో జాప్యం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు-కొత్తపట్నం రోడ్డులో బకింగ్ హాం కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణంలో డిజైన్‌మార్పు, నిధుల లభ్యతలో ఆలస్యం కారణంగా పనుల్లో కొంత జాప్యం జరిగినట్లు వైసిపి కొత్తపట్నం మండల నాయకులు తెలిపారు. వైసిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమయంలో వైసిపి నాయకులు ఆళ్ల రవీంద్రారెడ్డి, లంకపోతు అంజిరెడ్డి, వాయిల మోహన్‌రావు,శంకర్‌రెడ్డి మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణం కేంద్ర విపత్తుల నిధులతో ప్రారంభమైనట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనులు గత టిడిపి ప్రభుత్వ హయంలో కేవలం 40శాతం మాత్రమే జరిగినట్లు తెలిపారు. మరో 40శాతం పనులు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరిగాయని తెలిపారు. బ్రిడ్జి జలరవాణా కింద ఉన్నందున ఎత్తు పెంచి కట్టాలని డిజైన్‌లో మార్పు చేసినట్లు తెలిపారు. అనుమతులన్నీ వచ్చే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పథకం సమయం ముగిసి నిధులు ఆగిపోగినట్లు తెలిపారు. అసంపూర్తిగా ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవ చేసి ఇతర పథకంనుంచి నిధులు ఇప్పించి బ్రిడ్జి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కూడా పనులు ఆలస్యానికి కొంత కారణమని ఆరోపించారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో పనులు తుది దశకు చేరిన క్రమంలో టిడిపి నాయకులు అక్కడ పనులు జరగడం లేదని ఆరోపిస్తూ ఆందోళనలు చేయడం సరైందికాదన్నారు. కొత్తపట్నం మండలంలో పలు బ్రిడ్జిల నిర్మాణాలు కూడా గత కాంగ్రెస్ పార్టీ హయాంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రతిపాదనల మేరకే జరిగాయి తప్పా అందులో టిడిపి ఘనత ఏమి లేదన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డిపై టిడిపి నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని వారు హితవు పలికారు. బకింగ్‌హాం కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో పూర్తి కానున్నట్లు వారు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సంతనూతలపాడు రూరల్

పార్టీల కతీతంగా అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని బొడ్డువారిపాలెం, గంగవరం గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గడప గడపూ వెళ్లి సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద వర్గాలకు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తొలుత గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 21.5 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనం, రూ.17.80 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ఎస్‌పి కాలనీలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, ఎస్‌సికాలనీలో సైడ్ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచి తానిపర్తి వెంకటరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపిపి బి. విజయ, జడ్‌పిటిసి దుంపా రమణమ్మ, తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంపిడిఒ ప్రసాద్,



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్ బాబు

ఎపిపి బి. సుధాకర్ రావు, హౌసింగ్ డిఇ శ్రీనివాస ప్రసాద్, పంచాయతీ రాజ్ డిఇ కష్ణ మోహన్, ఎఇ రవిబాబు, ఎపిఒ వాసంతి, ఆర్‌డబ్ల్యుఎస్ వాలి బాబు, ఎఒ పావని, సొసైటీ అధ్యక్షుడు శివరామయ్య, యలమందారెడ్డి, ఎంపిటిసి ఎన్. రాధ తదితరులు పాల్గొన్నారు. **కొనకనమిట్ల :** ప్రజల సమస్యల తెలుసుకొని పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వద్దిమడుగు బిసి కాలనీలో గడపగడకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి గడపగడపకు తిరిగి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. నీటి సమస్య తీర్చాలని, అంతర్గత రహదారులు, సైడ్ కాలువలు అభివద్ధి చేయాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే దష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, సర్పంచి పిన్నికి పిచ్చయ్య, ఎంపిటిసి చక్కర వెలిగొండయ్య, ఉపసర్పంచి బూదాల యూతమ్, వైసిపి మండల మాజీ కన్వీనర్ రాచమల్ల వెంకట్రామిరెడ్డి, మండల ఎస్‌సి సెల్ నాయకుడు కోటేశ్వరరావు, ఇజ్రాయిల్, ఏసేబు, ఎపిఎం గోపాలకష్ణారెడ్డి, గనివెనపాడు సర్పంచి పాలూరి లక్ష్మీవెంకటేశ్వర్లు, ఇమ్మానియేల్, సచివాల సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన మాజీ సర్పంచి కోటేశ్వరరావు

టిడిపిలో చేరిన మాజీ సర్పంచి

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండలం మొగుళ్ళూరు గ్రామ మాజీ సర్పంచి మోపురి కోటేశ్వరరావు టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, టిడిపి రాష్ట్ర పరిశీలకుడు బిసి జనార్ధన్‌రెడ్డి, టిడిపి యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి ఇన్‌ఛార్జి గూడూరు ఎలక్షన్‌బాబు సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరాడు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు షరీఫ్, మొగులూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి, ఆవుల మాలకొండారెడ్డి, బైసాని సుబ్రమణ్యం, సోమిశెట్టి వెంకటసుబ్బారావు, షేక్ మౌలానాఆజాద్, శోభిరాల వేణుగోపాల్, చింతగుంట్ల నరేంద్ర, బాలరాజు, మాచర్ల పెద్దన్న పాల్గొన్నారు.

జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

పిసిపల్లి : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలపరిధిలోని గ్రామాల్లో ఎవరైనా కోడి పందేలు, పేకాట లాంటి జూదాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఎ.నాగేశ్వరరావు హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట జూదం నిర్వహిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ తెలిపారు.

ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల పరిధిలోని పెదఇర్లపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు శుక్రవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి ఒకేరెడ్డి లక్ష్మీకాంతం మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని సాంకేతిక విద్యలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్.అనురాధ, ఓకేరెడ్డి, సర్పంచి పోలం రమాదేవి, మైలా రవణమ్మ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సూరా మాల్యాద్రి, భూమిరెడ్డి కొండారెడ్డి, అలవల నరసింహారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-వెలిగండ్ల

సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలపరిధిలోని మొగులూరు గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ క్లబ్ టీం విజేతగా నిలిచింది. విజేతలను మాజీ ఎమ్మెల్యే , టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహరెడ్డి, టిడిపి రాష్ట్ర పరిశీలకుడు బిసి జనార్ధన్‌రెడ్డి, టిడిపి యర్రగొండపాలెం నియోజక వర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎలక్షన్‌బాబు శుక్రవారం విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కనిగిరి

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌హైవే రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి తిప్పారెడ్డి, బడుగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ విలువ కంటే మూడురెట్లు అదనంగా నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది రైతులకు న్యాయం చేయకుండా దౌర్జన్యానికి పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. హైవే నిర్మాణం ఒక్క అడుగు కూడా ముందుకు పడకుండా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం నాయకులు వీరం పుల్లారెడ్డి, అంబిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైసిపిని ఇంటికి సాగనంపాలి : టిడిపి

ప్రజాశక్తి-వెలిగండ్ల

ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందని టిడిపి నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని పి.రాళ్ళపల్లిలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న అరాచక పాలనను గురించి ప్రజలకు వివరిస్తూ వివరించారు. అదేవిధంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, బిసిసెల్ జిల్లా నాయకులు గవకట్ల హరికృష్ణ, టిడిపి నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షుడుఏ మీనిగ కాశయ్య, తెలుగు యువత మండల అధ్యక్షుడు కార్నటి భాస్కర్‌రెడ్డి, టిడిపి గ్రామ అధ్యక్షుడు రాజారత్నం, పెరుగు శివ, గురవయ్య, కడెం లక్ష్మయ్య, టిడిపి నాయకులు మోటాటి సుబ్బారెడ్డి, ఎస్‌సి సెల్ నాయకులు జి.వెంకటయ్య, ఆవుల మాలకొండారెడ్డి, దేవ, గురవయ్య, జయరాములు, ఇమ్మానియేలు, పి.కోటయ్య పాల్గొన్నారు.



ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి నాయకలు

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-తర్లుపాడు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. నూతనంగా నూతన లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి, రామసుబ్బారెడ్డి, జడ్‌పిటిసి వెన్నా ఇందిరా హనుమారెడ్డి, ఎంపిడిఒ ఎస్.నరసింహులు, తహశీల్దారు బొడిచర్ల శ్రీనివాసులు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు డి.పెద్దమస్తాన్, తర్లుపాడు గ్రామ సర్పంచి పల్లెపోగు వరాలు, ఎంపిటిసి వన్నెబోయిన అంకమ్మ, సీతానాగులవరం సర్పంచి తాడికొండ ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షురాలు కందుల సుజాత, వైసిపి మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, తాడివారిపల్లి సర్పంచి జనామాల జాన్ రత్నం, మండల కో ఆప్షన్ షేక్ అక్బర్‌ఆలీ, వైసిపి నాయకులు కలువ రామాంజ నేయరెడ్డి, సూరెడ్డి రామసుబ్బారెడ్డి, వెన్నా పెద్ద సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. **చీమకుర్తి :** మండల పరిధిలోని నిప్పట్లపాడు గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి చిన్నపురెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగవర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు.



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రావులపలి కోటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ చీదర్ల శేషు, యానం పెద్ద యోగయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు. **కొత్తపట్నం :** మండల పరిధిలోని ఆలూరు, గాదెపాలెం పంచాయతీలో నూతనంగా మంజూరైన లబ్ధిదారులు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరు సర్పంచి పూనూరు మాధవి, గాదెపాలెం సర్పంచి సుబ్బారెడ్డి, ఎంపిడిఒ పి.సుజాత, ఇఒఆర్‌డి బాల చెన్నయ్య పంచాయితీ కార్యదర్శులు, పంచాయితీ కార్యదర్శులు, ఉప సర్పంచి చాగంటి సుధాకర్ రెడ్డి, మూలకా రామిరెడ్డి, గ్రామ నాయకులు శైలేష్ బాబు, కోటిరెడ్డి సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శనగ పంటను పరిశీలిస్తున్న ఎఒ

పంటలు పరిశీలన

ప్రజాశక్తి -గిద్దలూరురూరల్

మండల పరిధిలోని పొదలకుంటపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన పంటను ఎఒ విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ శనగ మొక్క వేర్లను పరిశీలించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ గత నెలలో కురిసిన వర్షాలకు భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల మొక్కల వేర్లు భూమి నుంచి పోషక పదార్ధాలను పొందలేక పోతున్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. నల్లరేగడి భూముల్లో సాగు చేసిన శనగ పంటలో పోషక పదార్ధాల లోపం ఉన్నట్లు తెలిపారు. శనగలో పోషక పదార్ధాల నివారణకు 19:19:19 లేదా 13.0.45 రసాయన ఎరువులను ఎకరాకు 1.5 నుంచి 2.0 కిలోల చొప్పున వేయాలన్నారు. పంటకు తెగులు సోకితే హేగ్జాకోనాజోలు ఎకరానికి 400 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి, రైతులు పాల్గొన్నారు

కనీస గుర్తింపు కూడా ఇవ్వడం లేదు

ఇలవర గ్రామ సర్పంచి ప్రసన్నలక్ష్మి

ప్రజాశక్తి-కొండపి

గ్రామ సర్పంచిగా తనకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని మండల పరిధిలోని ఇలవర గ్రామ సర్పంచి దేపూరి ప్రసన్న లక్ష్మి మండల ప్రత్యేకఅధికారి అన్నపూర్ణ దేవి ఎదుట వాపోయారు. మండల ప్రత్యేక అధికారి ఇలవర గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ విషయం గురించి తెలుసుకున్న సర్పంచి సచివాలయానికి వెళ్లి సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో శాఖలు వారిగా సమీక్ష నిర్వహిస్తుండుగా గ్రామ సర్పంచి మాట్లాడుతూ తన ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవడం లేదని, బిసి మహిళనని తన పట్ల వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు నెలలుగా గ్రామంలో చేసిన పనులకు బిల్లులు కూడా పెట్టకుండా పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిపారు. వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జిగా వరికూటి అశోక్‌బాబు బాధ్యతలు చేపట్టినప్పటినుంచి అధికారులు తన పట్ల చిన్నచూపు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు వేయండి.. రోడ్డు వద్దండి..

- ఐలవరంలో ఇరు గ్రూపుల పోరు
- మధ్యలో నలుగుతున్న అధికారులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రహదారి ఏర్పాటు చేయాలని కొందరు వేడుకొంటుండగా అక్కడ రోడ్డు వేయటానికి వీలులేదంటూ మరికొందరు పట్టుబడుతుండంతో ఇరువురి మధ్య అధికారులు అవస్థలకు గురవుతున్నారు. మండలం లోని ఐలవరం గ్రామ దళితవాడలో 1977లో ప్రభుత్వం పేదలకు నివేశన స్థలాలు కేటాయించింది. ఈ స్థలాలతో పాటు బడి, గుడి, ఇతర ప్రజోపయోగ అవసరాల కోసం కొంత కమ్యూనల్ స్థలం కేటాయించింది. ఈ స్థలానికి ఆనుకొని ఉన్న కొన్ని ప్లాట్లకు రహదారి మార్గం కేటాయించడంలో ఆనాటి అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో కమ్యూనల్ స్థలానికి ఉత్తరం వైపున ఉన్న మూడు ప్లాట్లకు నిర్దేశిత రహదారి లేకపోవటంతో పక్కనున్న కమ్యూనల్ స్థలంలో నుంచే రాకపోకలు కొనసాగిస్తున్నారు. వర్షాకాలంలో పల్లపు ప్రాంతంగా ఉన్న కమ్యూనల్ స్థలంలోకి మోకటి లోతు నీరు నిలబడి ఉంటుంది. దీంతో ఈ మూడు కుటుంబాలవారు నీటిలోనే నడవాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ రహదారి నిర్మాణానికి ఆనాటి పాలకులు సిద్ధపడగా అదే గ్రామానికి కొందరు ఆ స్థలంలో ఎలాంటి రహదారి ఏర్పాటు చేయటానికి వీలులేదని ఆటకాయించి అడ్డుకోవడంతో ఆనాడు పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా రహదారి నిర్మించాలని కొందరు, వద్దని మరికొందరు పట్టుబడుతున్నారు.



ఐలవరం దళితవాడలో వివాదంతో నిలిచిన రహదారి ప్రాంతం

ఇదిలావుండగా ఇదే కమ్యూనల్ స్థలంలో ఒక పక్కన బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణానికి అధికారులు స్థలాన్ని కేటాయించడంతో సెంటర్ పనులు ప్రారంభించారు. బల్క్ మిల్క్ కేంద్రానికి కేటాయించిన విధంగానే తమకు కూడా రహదారికి స్థలం కేటాయించాలని అధికారులకు విన్నవించారు. దీంతో రెవెన్యూ అధికారులు రహదారి నిర్మాణానికి అనుమతినిచ్చారు. పంచాయతీ అధికారులు రహదారిలో సిసి వేసేందుకు పూనుకోగా మొదట నుంచి అడ్డుకుంటున్న వారు రోడ్డు వేయటానికి వీలులేదని పట్టుబట్టారు. దీంతో రోడ్డు కావాలనే వర్గం బల్క్ మిల్క్ కేంద్రానికి ఉమ్మడి స్థలం కేటాయించారని, రోడ్డు వేయకపోతే బల్క్ మిల్క్ కేంద్రం కూడా నిర్మించడానికి వీలులేదని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో చేసేదేమీ లేక రాజీ ప్రయత్నం చేసి రహదారి నిర్మాణానికి పాలకవర్గం తీర్మానం కూడా చేసింది. అయినప్పటికీ అదే దళితవాడ ప్రజలు కొందరు రోడ్డును నిర్మించడానికి వీలులేదని అడ్డుకుంటున్నారు. దీంతో రోడ్డు కావాలనే వర్గం కోర్టు కేసులతో పాటు గ్రీవెన్స్‌లను ప్రతి వారం ఆశ్రయిస్తుండటంతో క్షేత్రస్థాయి అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రతి పిటిషన్‌పై నిరంతరం ఉన్నతాధికారులకు సమాధానం చెప్పటం నిత్యకృత్యంగా మారింది. దీనివలన గ్రామంలో పాలన ఒక దశలో కుంటుపడింది.

సున్నిత సమస్య.. పరిష్కారం లేకపోలేదు

దళితవాడలో నెలకొన్న రహదారి సమస్య రెండు పార్టీలకు చెందినది. ఇరువర్గాలు ఎవరికివారు పట్టుదలకు పోవటం వల్ల సమస్య పెద్దదవుతోంది. ఒకే సామాజిక వర్గానికి చెందిన వీరిని గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కలసి ఇరు వర్గాలను కూర్చోపెట్టి మాట్లాడితే సమస్య పరిష్కారం అవుతుందని అంటున్నారు. దీని కారణంగా అధికారులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కరణం వెంకటేష్‌కు108 సిబ్బంది వినతి

ప్రజాశక్తి-చీరాల



కరణం వెంకటేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి, వైసీపీ పెద్దల దృష్టికి తీసుకొనివెళ్లాలని 108 ఉద్యోగులు చీరాల వైసీపీ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో అత్యవసర సేవలను అందజేస్తున్న 108 ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ వారు వచ్చిన తరువాత అక్రమంగా వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి తీసుకోవాలన్నారు. 108 సర్వీస్‌లో పనిచేస్తున్న ప్రతి ఈఎంటీకి నెలకు రూ.30 వేలు, పైలెట్లకు రూ.28 వేలు వేతనాలను అమలు చేయాలని కోరారు. ఈ సర్వీసులో 8 గంటల పని సమయాన్ని అమలుపరిచి ఉద్యోగులపై ఉన్న ఒత్తిడిని తగ్గించాలని కోరారు. సంస్థ యాజమాన్యం పీఎఫ్, ఇఎస్ఐల నిమిత్తం ఉద్యోగి వాటాను మాత్రమే ఉద్యోగి జీతం నుంచి మినహాయిస్తున్నారని, ఇది చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు. సరైన కండీషన్‌లో లేని వాహనాల వల్ల బాధితులను చేరుకోవడంలో జాప్యం జరుగుతోందని అన్నారు. అన్ని వాహనాలు కండీషన్లో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ చెల్లింపులతో నిమిత్తం లేకుండా ప్రతి నెలా 1వ తేదీన వేతనాలను చెల్లించాలని అన్నారు. కరణం వెంకటేష్ బాబు మాట్లాడుతూ ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి, వైసిపి పెద్దల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అత్యవసర సమయంలో పేషెంట్స్‌కి మంచి వైద్య సహాయాన్ని అందిస్తున్న 108 సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 108 సర్వీసెస్ కాంటాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ సుబ్బారావు, శ్రీనివాసరావు, భాస్కర్, గాలిరెడ్డి, ఆదం, కమలాకర్, చందు మరియు ఇతర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు

పేదలను ఆదుకుంటున్న సిఎం: మంత్రి

ప్రజాశక్తి-అమృతలూరు



కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదలకు ఆపన్నహస్తం అందించి ఆదుకునే గొప్ప మనసున్న వ్యక్తి అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున అన్నారు. అమృతలూరు మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను శుక్రవారం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేదలకు జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక చంద్రబాబు, ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నేడు రోడ్‌షోల పేరుతో ప్రజలను నిర్ధాక్షణ్యంగా చంపివేస్తున్నారన్నారు. దీనికి నిదర్శనమే గుంటూరు, కందుకూరులలో జరిగిన విషాదాలని అన్నారు. ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీకి కట్టుబడి విడతల వారీగా పింఛన్‌ను రూ.3000కు పెంచుతూ అవ్వాతాతలకు బాసటగా నిలుస్తున్నాడని చెప్పారు. ఈ సందర్భంగా మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్‌లను పంపిణీ చేశారు. వైసిపి వేమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చర్లపల్లి మోహన్‌రావు, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, వైసీపీ మండల కన్వీనర్ యలవర్తి సురేష్, పిడి డిఆర్డిఏ అర్జున్‌రావు, తహశీల్దారు మేహర్ కుమార్, ఎంపీడీవో మహబూబ్ సుభాని, ఈవోపీఆర్డి మరేకుమారి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఆర్‌పీ తీరుపై ఎంఇఒకు ఫిర్యాదు

- ఉపాధ్యాయులను కించపరుస్తున్నాడంటూ ఆరోపణలు
- ప్రశ్నపత్రాలు సకాలంలో ఇవ్వడం లేదు: యుటిఎఫ్

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఉపాధ్యాయులను కించపరుస్తూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతూ ప్రశ్నపత్రాలు సకాలంలో అందించకుండా వేధింపులకు గురిచేస్తున్న సీఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మార్టూరు ఎంఈఓ వస్రాం నాయక్‌కు ఫిర్యాదు చేయడం శుక్రవారం మండలంలో కలకలం రేపింది. యూటీఎఫ్ మార్టూరు శాఖ అధ్యక్ష కార్యదర్శులు బండారు ఆదినారాయణ, పోపూరి సునీల్ కుమార్ ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం మార్టూరు విద్యావనరుల కేంద్రంలో రమేష్ సీఆర్‌పీ గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మెటివ్-1 పరీక్షలకు సంబంధించి సీఆర్‌పీ రమేష్ 10 ప్రాథమిక పాఠశాలలు, రెండు యూపీ స్కూళ్లు, ఒక జడ్పీ హై స్కూల్ మొత్తం 13 పాఠశాలలకు నిర్ణీత సమయంలో ఉపాధ్యాయులకు ప్రశ్నాపత్రాలు అందించాల్సి ఉంది. రమేష్‌తో పాటు



ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు

సీఆర్పీలుగా విధులు నిర్వహిస్తున్న మరో ఇద్దరు సకాలంలో ఉపాధ్యాయులకు ప్రశ్నపత్రాలు అందిస్తుండగా, రమేష్ మాత్రం ఉదయం 8-40 గంటల వరకు ఆఫీస్ తాళాలు తీయకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడంటూ ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన ఉపాధ్యాయులను ఎంఈఓ గ్రూప్‌లో ఏంది పంతులా.. జీవో చూసుకొని మాట్లాడు అంటూ పొగరుగా సమాధానం ఇచ్చిన సందేశాలను సైతం ఉపాధ్యాయులు మీడియాకు విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు ఉపాధ్యాయులు ముఖ ఆధారిత హాజరు పాఠశాలలో వేయవలసి ఉండగా 8-40 గంటల వరకు కూడా సీఆర్‌పి ప్రశ్నపత్రాలు ఇవ్వకపోతే మార్టూరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఉపాధ్యాయులు సకాలంలో ఎలా హాజరు వేయగలుగుతారని ప్రశ్నించారు. ప్రశ్నించిన తమపై ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నాడంటూ వారు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తున్న సీఆర్‌పి రమేష్‌పై తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. కాగా ఈ విషయంపై ఎంఈఓ వస్రాం నాయక్‌ను విలేకరులు వివరణ కోరగా ఉపాధ్యాయుల పట్ల సీఆర్పీ రమేష్ దురుసుగా ప్రవర్తించాడని ఉపాధ్యాయులు తనకు ఫిర్యాదు చేశారని, విచారించి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి మరియమ్మ

17 కొత్త పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం పూండ్ల గ్రామ సచివాలయం పరిధిలో కొత్తగా 17 మందికి వైఎస్ఆర్ పెన్షన్ కానుక అందించామని పూండ్ల పంచాయతీ కార్యదర్శి జే మరియమ్మ అన్నారు. శుక్రవారం పూండ్ల గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ప్రజల వినతుల మేరకు రూ.10 లక్షలతో రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని అన్నారు. 3 కల్వర్టులు 2 లక్షల నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 12 లక్షలతో సైడు కాల్వల నిర్మాణం జరిగిందన్నారు. అలాగే రూ.3.5 లక్షలతో హిందూ శ్మశాన వాటిక ప్రహరీని నిర్మించాల్సి ఉందని తెలిపారు. మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో ముస్లిం ఖబరస్తాన్‌లో కల్వర్టు నిర్మాణం కోసం రూ.2 లక్షలు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్ నరసింహారావు, ఎంపీటీసీ షేక్ షబానా, వైసీపీ సీనియర్ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుమందు షాపులు తనిఖీ

ప్రజాశక్తి-చిన్నగంజాం



తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి

అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న పురుగు మందులు ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి కె భాస్కరరావు శుక్రవారం తనిఖీ చేశారు. నాణ్యతలేని ఎరువులు, పురుగు మందులను ఎవరూ విక్రయించకూడదని దుకాణ యజమానులకు సూచించారు. ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని, లైసెన్సులు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. చినగంజాం, కడవకుదురు, పెదగంజాం గ్రామాల్లో ఉన్నటువంటి లైసెన్స్ షాపులను ఆయన తనిఖీ చేశారు. నాణ్యత పరీక్ష కోసం విత్తనాలు 8, ఎరువులు 14, పురుగు మందులు 11 శాంపిల్సు సేకరించి ల్యాబ్‌లకు పంపించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు దుకాణ యజమానులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-అద్దంకి

మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ జెడ్‌పి నిధులతో ఉచిత మెటీరియల్‌ను అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వూటుకూరు శ్రీనివాసులు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పరిమళ ఫౌండేషన్ చైర్మన్ బివి కృష్ణారెడ్డి హాజరయ్యారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ మెటీరియల్‌ను ఉపయోగించుకొని, బాగా చదివి, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిపి యర్రమోతు రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొమ్మినేని శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జర్నలిస్టులు

ప్రభుత్వంలో లోపాలుంటే.. ఆ వార్తలు రాయడంలో తప్పులేదు..

- ప్రభుత్వం దృష్టికి పాత్రికేయుల సమస్యలు తీసుకెళతా..
- రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వంలో లోపాలు ఉంటే ఆ వార్తలు రాయడంలో తప్పు లేదని రాష్ట్ర ప్రెస్ అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఒంగోలు ప్రెస్ క్లబ్ నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. తొలుత ఎన్ఎస్‌పి అతిథి గృహానికి చేరుకున్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరావుకు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.గ్రేస్ లినోర, ఇతర అధికారులు, పాత్రికేయులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో నిష్పాక్షికత ముఖ్యమని, విద్వేష పూరితంగా పక్షపాతంతో మీడియా వ్యవహరించకూడదని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యలో వారధిగా మీడియా కీలకపాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. జర్నలిజంలో వస్తున్న మార్పులను దష్టిలో ఉంచుకుని పాత్రికేయులకు అవగాహన కార్యక్రమాలు, సెమినార్లు, డిప్లమా కోర్సులు, సర్టి ఫికెట్ కోర్సులను ప్రెస్ అకాడమీ తరపున నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్ పాత్రికేయుల అనుభవాలు, సూచనలను వీడియోల రూపంలో ప్రెస్ అకాడమి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పాత్రికేయుల సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళతామని ప్రకటించారు. పాత్రికేయులు కూడా ఏకాభిప్రాయానికి రావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఒంగోలు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మీసాల శ్రీనివాస్, ఎస్‌వి బ్రహ్మం, గొట్టిపాటి నాగేశ్వరరావు, మాధవ రెడ్డి, పీర్ల రాజేష్, ఆర్.శ్రీనివాస్ నాయక్, వెంకట్రావు పాల్గొన్నారు.

9న తాగునీటి సరఫరా నిలిపివేత

ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని భాగ్యనగర్, హౌసింగ్‌బోర్డు మెయిన్ రోడ్డు మీద ఉన్న తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు కారణంగా ఈ నెల 9న నగరంలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందువల్ల తొమ్మిదిన తాగు నీరు సరఫరా కావాల్సిన వారికి పదో తేదీ, పదో తేదీ సరఫరా కావాల్సిన వారికి 11వ తేదీ, 11వ తేదీ సరఫరా కావాల్సిన వారికి 12వ తేదీన సరఫరా చేయడం జరుగుతోందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం నగరంలోని పలు సచివాలయాలను సందర్శించారు. త్రోవగుంట, అంబేద్కర్ నగర్ సచివాలయాలలో జగనన్న శాశ్వత భూ హక్కు పథకం రికార్డులను పరిశీలించారు. సచివాలయాలకు వస్తున్న దరఖాస్తులు, వాటి పరిష్కారాల గురించి సిబ్బందితో చర్చించారు. వారికి పలు సూచనలు చేశారు. సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, వారి దరఖాస్తులు ఎప్పటిలోపు పరిష్కారం అవుతాయో నిర్ధిష్టంగా తెలియజేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పుర పాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండల పరిధిలోని వెల్లంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దళారులు, మధ్యవర్తులు లేకుండా నేరుగా ధాన్యం అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ ఉంటుందని చెప్పారు. గ్రామాల్లో తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించి నష్ట పోవద్దన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. ధాన్యాన్ని విక్రయించిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నేరుగా నగదు జమ చేస్తుందని చెప్పారు. రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి సురేష్

పింఛన్లు పంపిణీ..

వైఎస్ఆర్ పింఛన్ కానుక వారోత్సవాల్లో భాగంగా మంత్రి సురేష్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేరుస్తూ పింఛన్‌ను రూ.2750కు పెంచినట్లు తెలిపారు. ప్రతినెలా మొదటి తేదిన ఠంచన్‌గా పింఛన్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ వైసిపి ప్రభుత్వమే అన్నారు. కుల, మత పార్టీలకు అతీతంగా అర్హత ప్రామాణికంగా పింఛన్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దిక్కుమాలిన జన్మభూమి కమిటీల వల్ల అర్హులైన వారు కూడా గతంలో ఇబ్బంది పడ్డారని తెలిపారు. ఇప్పుడు ఏ కమిటీ గానీ, దళారులు గానీ లేకుండా అర్హత ఉంటే చాలు నేరుగా వారి ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు, ఏఎంసి ఛైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, సర్పంచ్ పొన్నా వెంకటలక్ష్మి, జడ్పిటిసి మాకం జాన్‌పాల్, వైసిపి మండల కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, ఏపీఎ నీరజ, వైసిపి నాయకులు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్ ప్రాంగణంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్‌ను శుక్రవారం ఒంగోలు, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఇన్‌చార్జ్ బిసి జనార్ధన్‌రెడ్డి ప్రారభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఒక్కసారి అని అవకాశం ఇస్తే ప్రజలను అష్టకష్టాల పాల్జేశాడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వ హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలు బాగుపడటమే తప్ప ప్రజలకు ఒనగూరింది ఏమీ లేదన్నారు. ఉగ్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్ నిర్వహణకు ఆయన రూ.లక్ష విరాళం ప్రకటించారు. కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ డాక్టర్ ఉగ్రతోనే కనిగిరి అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయలేనివారు పోలవరం ప్రాజెక్ట్‌ను ఎలా పూర్తి చేస్తారన్నారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక వ్యాపారమే సాగుతోందన్నారు. చీరాల ఇన్‌ఛార్జ్ ఎంఎం కొండయ్యయాదవ్ మాట్లాడుతూ పెద్దఎత్తున వైసీపీ ప్రభుత్వంపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోందని విమర్శించారు. యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ దళితులకు అండగా ఉంటామని అధికారంలోకి వచ్చిన వైసిపి ఆధ్వర్యంలో దళితులపై దాడులు పెరిగాయన్నారు. గిద్దలూరు ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎస్ఎన్‌పాడు ఇన్‌ఛార్జి బిఎన్.విజయ్‌కుమార్, టిడిపి రాష్ట్ర నాయకులు దామచర్ల సత్య మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు డాక్టర్ ఉగ్ర అన్నా క్యాంటీన్‌ను ఏర్పాటుచేసి ప్రజల పక్షాన ఉన్నానని నిరూపించారన్నారు. జిల్లాలోని 12 నియోజకవర్గాలలో టిడిపి విజయం సాధించటం జరుగుతుందన్నారు. అన్నా క్యాంటీన్‌లో భోజనం చేసేందుకు ప్రజలు బారులు తీరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరుమండలాలకు చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.



అన్నా క్యాంటీన్ వద్ద బారులు తీరిన ప్రజలు

కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-మేదరమెట్ల

శ్రీభ్రమరా గ్రోత్ సిటీ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి మూడు రోజుల పాటు జరగనున్న కబడ్డీ టోర్నమెంట్‌ను శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ క్రీడ అయిన కబడ్డీని ప్రోత్సహిస్తూ.. ఇక్కడ పోటీలను నిర్వహిస్తున్న భ్రమరా మేనేజింగ్ డైరెక్టర్ రామచంద్రరావును కొనియాడారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఓడినా, గెలిచినా స్ఫూర్తిగా తీసుకొని, ఉన్నత క్రీడాకారులుగా వృద్ధి చెందాలని సూచించారు. అనంతరం భ్రమరా గ్రోత్ సిటీ డైరెక్టర్ రామ చంద్రరావు మాట్లాడారు. ఈ పోటీలలో 8 జట్లు పాల్గొననున్నాయి.కార్యక్రమంలో ఇన్‌కంటాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పి.అనిల్‌కుమార్, ఆర్డీవో సరోజినీదేవి, అద్దంకి వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కష్ణచైతన్య, మాజీ శాసనసభ్యులు బాచిన చెంచు గరటయ్య, ఇందూర్ బాబు, శైలేష్‌లతోపాటు ఆంధ్రప్రదేశ్ కబాడీ రిఫరీస్ బోర్డు ఛైర్మన్ పి కష్ణమూర్తి, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్ర భాస్కరరావు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌కు కొత్త భాష్యం చెప్పే వీరసింహారెడ్డి



మాట్లాడుతున్న బాలకృష్ణ

- చరిత్రలో నిలిచిపోయే సినిమా
- సినీ హీరో నందమూరి బాలకృష్ణ
- అట్టహాసంగా 'వీర సింహారెడ్డి' ప్రీ రిలీజ్ ఫంక్షన్



మాట్లాడుతున్న శృతిహాసన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎమోషనల్ బ్యాక్‌డ్రాప్‌తో ఫ్యాక్షన్‌కు కొత్త భాష్యం చెబుతూ చరిత్రలో నిలిచిపోయే సినిమాగా 'వీర సింహారెడ్డి' నిలుస్తుందని ప్రముఖ హీరో, హిందుపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఒంగోలు అర్జున్ ఇన్‌ఫ్రాలో శుక్రవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. ఈ ఫంక్షన్‌కు ఉభయ రాష్ట్రాలు, చెన్నై, బెంగళూరు, అమెరికా వంటి దేశాల నుంచి బాలయ్య అభిమానులు తరలిరావటంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ ఫంక్షన్‌ను శ్రేయాస్ మీడియా నిర్వహించగా.. వ్యాఖ్యతగా ప్రముఖ యాంకర్ సుమ వ్యవహరించారు. వీరసింహారెడ్డి ట్రైలర్‌ను ప్రముఖ దర్శకులు బి.గోపాల్ ఆవిష్కరించి మాట్లాడుతూ ఎం.నిడమానూరు తమ స్వగ్రామమని, తాను ఎన్టీఆర్‌కు వీరాభిమానని తెలిపారు. ప్రముఖ హీరో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ తన ఫ్యాన్స్ అంతా కలసి సమిష్టిగా చేసిన సినిమాగా వీరసింహారెడ్డి నిలుస్తుందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో హీరోగా ఉచ్చ స్థితిలో ఉన్న దునియా విజయ్ ఈ సినిమాలో ప్రతినాయకునిగా తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తారన్నారు. చక్కని ఫైట్స్ కంపోజ్ చేసిన ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్, వెంకట్ ఒంగోలియన్స్ అని పేర్కొన్నారు. తన అభిమానిగా డైరెక్టర్ మలినేని గోపిచంద్ తనదైన మార్క్‌తో ఒక స్థాయికి, మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఎస్ రీరికార్డింగ్‌లో మరొక స్థాయికి సినిమాను తీసుకెళ్ళారన్నారు. డైరెక్టర్ మలినేని గోపిచంద్ మాట్లాడుతూ ఫంక్షన్ విజయవంతం కావటానికి సహకరించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్‌పి, అదనపు ఎస్‌పి, ఒంగోలు డిఎస్‌పికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హీరోయిన్ శ్రుతి హాసన్, నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మాటల రచయిత సాయి మాధవ్ బుర్రా, ఫైట్ మాస్టర్ రామ్ లక్ష్మణ్, సింగర్ మనో, నటులు అజయ్ ఘోష్, సప్తగిరి, హీరోయిన్ హని రోజ్, ప్రత్యేక గీతం చేసిన చంద్రిక రవి ప్రసంగించారు. చంద్రిక రవి చేసిన 'మా బావ మనోభావాలు దెబ్బతిన్నాయ్' ప్రత్యేక గీతం ఆకట్టుకుంది. సినిమాలోని పాటలకు ఉదయ్ మాస్టర్, రామ్ మాస్టర్ బృందాలు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.